## క్లుప్తంగా

### రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

నెహ్రూనగర్: నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రం తాగునీటి సరఫరా నిలిపి వేయనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉండవల్లి రా వాటర్ పంప్ హౌస్ నుంచి తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ మీద ఫ్లో మీటర్ బిగింపు నిమిత్తం ఉండవల్లి పంప్ హౌస్, హెడ్ వాటర్ వర్క్స్ ఫిల్టరేషన్ ప్లాంట్లను శనివారం సాయంత్రం నిలిపి వేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. దీనివల్ల నగరంలోని ఐపీడీ కాలని, గుజ్జనగుండ్ల, విద్యా నగర్, హనుమయ్య నగర్, నల్లచెరువు, శ్రీనివాసరావు తోట, తారక రామ నగర్, ఏటీ అగ్రహారం, బి.ఆర్. స్టేడియం, ఎల్.బి.నగర్, గోరంట్ల, అడవి తక్కెళ్లపాడు, రాజీవ్‌గాంధీ నగర్, జిల్లా కోర్ట్ కాంపౌండ్, మిర్చి యార్డ్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, శ్యామలా నగర్, రెడ్డి పాలెం రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపి వేయనున్నట్లు వెల్లడించారు. ఆదివారం ఉదయం నుంచి యథావిధిగా సరఫరా జరుగుతుందని ఆమె తెలిపారు.

### ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



పట్నంబజారు: ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా సూచించారు. నియోజకవర్గంలోని 12వ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. ముందుగా బండ్లబజారు ప్రాంతంలో పర్యటించిన ఆయన లీకులు ఏర్పడిన డ్రెయినేజీ, కాల్వలను పరిశీలించారు. తక్షణమే అధికారుల్ని పిలిపించి త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మార్కెట్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. రోడ్లన్నీ పరిశుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి వాటిని తీసుకెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి సలీం, మహేష్ పాల్గొన్నారు.

### ముగ్గురి అదృశ్యంపై కేసులు నమోదు



జాన్‌బాషా

గుంటూరు ఈస్ట్: వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారం జీరో లైనుకు చెందిన షేక్ జాన్ బాషా బుధవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడు. అతని ఆచూకీ కోసం వెతికి, కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు గురువారం నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831336 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

- ఏసుభక్త నగర్‌కు చెందిన ప్రభుకుమార్ మతిస్థిమితం లేకపోవడంతో 15 రోజుల కిందట ఇంట్లోంచి ఎటో వెళ్లిపోయాడు. పలుచోట్ల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- ఎన్టీఆర్ నగర్‌కు చెందిన షేక్ జానీ బాషా ఈనెల 14న ఇంట్లోంచి వెళ్లిపోయాడు. పలుచోట్ల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రత్తిపాడులో రైతు....



రామకృష్ణా రెడ్డి

పాతమల్లాయపాలెం (ప్రత్తిపాడు): పొలంలో పిచికారీ చేసేందుకు పురుగు మందులు కొనుక్కుని వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం గ్రామానికి చెందిన కారుమూరి రామకృష్ణారెడ్డి (30) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పురుగు మందుల కొనుగోలు కోసం ఈనెల 11వ తేదీ రాత్రి ఏడున్నర గంటల సమయంలో ఇంటి నుంచి మోటార్ సైకిల్‌పై బయలుదేరి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో పాటు మొబైల్ కూడా స్విచ్ఛాఫ్ అని వస్తోంది. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు తమకు తెలిసిన వారితో పాటు చుట్టుపక్కల వెతికినా ఉపయోగం లేకపోయింది. దీంతో అతని భార్య మాధవి గురువారం ప్రత్తిపాడు పోలీసుల్ని ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మానాయుడు తెలిపారు.

# రాష్ట్రాన్ని ప్రగతి పథంలోకి తీసుకెళుతున్న సీఎం జగన్

**ఎమ్మెల్యే ముస్తఫా**



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, పార్టీ నేతలు

పట్నంబజారు: రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళుతూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా చెప్పారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం వైఎస్సార్ సీపీ జిల్లా ఐటీ వింగ్ ఆధ్వర్యంలో ఈనెల 18న విజయవాడలో జరుగనున్న జగనన్న ప్రగతి పథం ర్యాలీ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరగని అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిందని తెలిపారు. జగనన్న పాలనలో సామాన్యుడికి పెద్దపీట వేయడంతో పాటు, సంక్షేమాన్ని గడప వద్దకు చేర్చారని పేర్కొన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ పరిపాలన అంటే ఎలా ఉండాలో రాష్ట్రంలో చేసి చూపిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందని చెప్పారు. ఈనెల 18 ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ప్రగతి పథకం ర్యాలీని జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు మాదాసు కిరణ్, ఐటీ విభాగం సభ్యులు అవినాష్, ఫిరోజ్, శ్రీక్రాంత్ యాదవ్, అబ్దుల్‌సలాం పాల్గొన్నారు.

# గ్రంథాలయ ఉద్యమ పితామహులకు ఘన నివాళి



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న ఝాన్సీలక్ష్మి, సిబ్బంది



గార్డెన్స్ గ్రంథాలయంలో విద్యార్థులతో శకుంతల, సత్య శిరీష



ఎస్వీఎన్ కాలనీ గ్రంథాలయంలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రంథాలయ వ్యవస్థ కోసం ఉద్యమాలు చేసిన మహనీయుల్ని స్మరించుకోవాల్సిన అవసరముందని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ఝాన్సీలక్ష్మి పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాధాలయంలో గురువారం గ్రంథాలయ ఉద్యమ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య, డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్, పాతూరి నాగభూషణం, గాడిచర్ల సర్వోత్తమరావు చిత్రపటాలకు పూలమాల వేసి, వారి సేవల్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా 6,7 తరగతుల విద్యార్థులకు 'స్మార్ట్‌ఫోన్‌–లాభనష్టాలు', 8,9,10 తరగతుల విద్యార్థులకు 'చంద్రయాన్‌–3 విజయగాథలు', కళాశాల విద్యార్థులకు 'మహిళలపై వేధింపులు–ప్లాస్టిక్ నియంత్రణలో పౌరుల పాత్ర' అనే అంశాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. వాణిజ్య పన్నులశాఖ ఉప కమిషనర్ కె. చంద్రశేఖరరావు, కన్న స్కూల్ హెచ్ఎం కె. సుజన న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఎం. సీతారామయ్య, గ్రంథ పాలకులు చిన్నపరెడ్డి, ఎన్. నాగిరెడ్డి, దుర్గారెడ్డి, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

**గార్డెన్స్ గ్రంథాలయంలో...**

బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయంలో విద్యార్థులకు చంద్రయాన్‌–3పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ పాఠశాలల ఉపాధ్యాయులు షేక్ జానీబాషా, సరిత, గ్రంథాలయాధికారులు బి. శకుంతల, పి. సత్య శిరీష, సిబ్బంది పి. కోటేశ్వరి, పి. సుధాకరరావు, పాఠకులు పాల్గొన్నారు.

**ఎస్వీఎన్ కాలనీలో...**

ఎస్వీఎన్ కాలనీలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు 'గ్రంథాలయాల వల్ల ఉపయోగాలు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో చిన్మయ విద్యాలయ తెలుగు ఉపాధ్యాయురాలు అమృతవల్లి, వెంకటేశ్వరరావు, అనురాధ, పూజ, రికార్డు అసిస్టెంట్ బి. వెంకాయమ్మ పాల్గొన్నారు.

**ప్రాంతీయ గ్రంథాలయంలో ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన**



ప్రాంతీయ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన తిలకిస్తున్న సందర్శకులు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం ఏసీ కళాశాల వద్ద ఉన్న ప్రాంతీయ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య, డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్, పాతూరి నాగభూషణం, గాడిచర్ల సర్వోత్తమరావు చిత్రపటాలకు ప్రథమ శ్రేణి సహాయ గ్రంథ పాలకుడు కె. సుధాకరరావు, గ్రంథాలయాధికారి ఎస్. వెంకటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నీటి గుంతలో పసికందు మృతదేహం



జనావాసాల మధ్య మురుగు నీటి గుంతలో శిశువు మృతదేహం

ప్రత్తిపాడు: స్థానిక దళితవాడలో జనావాసాల మధ్యనున్న ప్రైవేట్ స్థలంలోని మురుగు నీటి గుంతలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు శిశువును పడేశారు. కనీసం బొడ్డు తాడు కూడా కత్తిరించకుండా పడి ఉన్న శిశువు దేహం నీటిలో నాని పూర్తిగా ఉబ్బిపోయి నిర్జీవంగా ఉంది. దీంతో రెండు రోజుల కిందట నీటిలో పడేసి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. రెండు రోజులుగా శిశువును దూరం నుండి చూస్తున్నామని, బొమ్మ అనుకుని పట్టించుకోలేదని, కానీ గురువారం ఉదయం ఈగలు, పురుగులు వాలడంతో దగ్గరకు వెళ్లి చూసి, పసికందని నిర్ధారించుకున్నామని స్థానికులు చెబుతున్నారు. దీంతో విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న ప్రత్తిపాడు సీఐ ఎం.వి సుబ్బారావు, ఎస్ఐ డి. రవీంద్రబాబులు చుట్టుపక్కల వారిని విచారించారు. స్థానికులెవ్వరూ తమకు సంబంధం లేదని, ఇది తమ ఊరి వాళ్లు చేసిన పని కాదని, ఎవ్వరో ఎక్కడి నుండో తీసుకువచ్చి ఇక్కడ పడేశారని తెలిపారు. దీంతో అంగన్వాడీ సిబ్బంది సాయంతో వివరాలను సేకరిస్తున్నారు. స్థానికుల సాయంతో పోలీసులు శిశువు మృతదేహాన్ని బయటకు తీసి, గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## నేటి నుంచి బ్రదర్ హుడ్ వారోత్సవాలు

గుంటూరు ఎడ్యుకేషన్: లాడ్జి సెంటర్‌లోని పెట్రోల్ బంక్ వెనుక ఉన్న శ్రీకృష్ణదివ్య జ్ఞాన సమాజ (లాడ్జి) ఆవరణలో ఈనెల 17 నుంచి 23వ తేదీ వరకు బ్రదర్ హుడ్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ ఎం. కోదండ రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 20న మధ్యాహ్నం 1.30 గంటలకు పాఠశాల విద్యార్థులకు క్విజ్, 3.30 గంటలకు కళాశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు, 21న తెలుగులో వక్తృత్వ పోటీలు, 22న సుడోకు పోటీలు, 23న ఆంగ్లంలో వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఒక విద్యాసంస్థ నుంచి ఆయా పోటీలకు నలుగురు చొప్పున విద్యార్థులు పాల్గొనవచ్చని, పాల్గొనేందుకు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల విద్యార్థిని, విద్యార్థులు 9441655888 నంబర్‌కు ఎంట్రీలను ఈనెల 18లోపు సంబంధిత విద్యాసంస్థ ద్వారా పంపాలని సూచించారు. ఆధ్యాత్మిక విషయాలపై శుక్రవారం నుంచి ఈనెల 23 వరకు ప్రతి రోజూ సాయంత్రం ఉపన్యాసాలు ఉంటాయని తెలిపారు.

# సిబార్‌లో అరుదైన శస్త్ర చికిత్స



శస్త్ర చికిత్సలో పాల్గొన్న వైద్య బృందం

పెదకాకాని: ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్ట మొదటిసారిగా సిబార్ దంత వైద్య కళాశాలలో అరుదైన శస్త్ర చికిత్స ద్వారా టెంపోరోమ్యాండిబులర్ జాయింట్ ప్రోస్టసిస్ సహాయంతో ఇరు వైపులా దవడ కీలు మార్పిడి విజయవంతంగా పూర్తి చేసినట్లు డీన్ డాక్టర్ ఎల్. కృష్ణప్రసాద్ తెలిపారు. మండలంలోని తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో ఆయన వివరాలు తెలిపారు. పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామానికి చెందిన 27 సంవత్సరాల నాగమౌనిక పుట్టుకతోనే నోరు తెరవలేక బాధపడుతూ ఉందని, పలుచోట్లకు చికిత్స కోసం వెళ్లినప్పటికీ నిరాశే ఎదురైందని చెప్పారు. నవంబరులో సిబార్ దంత వైద్య కళాశాలకు రాగా పరీక్షలు చేసి ఇరువైపులా దవడ కీలు అతుక్కుని ఉన్నట్లు గుర్తించి శస్త్ర చికిత్స చేసినట్లు వివరించారు. ఈ శస్త్ర చికిత్సలో సిబార్ డాక్టర్లు కృష్ణప్రసాద్, శ్రీనివాస చక్రవర్తి, నూరుద్దీన్, రాజా సతీష్, ఆనంద్ విజయ్, వివేకానంద, మనోజ్‌కుమార్, విద్యాసాగర్, పూజ, సింధూజ, పోస్టుగాడ్యుయేట్లు పాల్గొన్నారు. వైద్య బృందాన్ని కళాశాల డీన్ డాక్టర్ ఎల్. కృష్ణప్రసాద్ అభినందించారు.

## తక్కెళ్లపాడు ఉప సర్పంచిగా వేణుకుమార్

పెదకాకాని: మండలంలోని తక్కెళ్లపాడు ఉప సర్పంచిగా మోపర్తి వేణుకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ బలపరచిన 10 మంది, వైఎస్సార్ సీపీ బలపరచిన నలుగురు వార్డు సభ్యులుగా గెలుపొందారు. ఉప సర్పంచి ఎంపిక ఒప్పందంలో భాగంగా రెండు సంవత్సరాలు ఒకరు, మిగతా మూడు సంవత్సరాలు మరొకరు చేయాల్సి ఉంది. మొదటి రెండేళ్లు ఉప సర్పంచిగా పని చేసిన వెలినేని శ్రీనివాసరావు ఐదు నెలల కిందట రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఉప సర్పంచి ఎన్నిక నిర్వహించిన అధికారులు మోపర్తి వేణుకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ప్రకటించారు. ఎన్నిక ప్రక్రియలో మండల విద్యాశాఖాధికారి డి. బలిరాం, పంచాయతీ కార్యదర్శి హరిబాబు పాల్గొన్నారు.

# జగన్‌ను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం



ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను తెలియజేస్తున్న మేయర్

నెహ్రూనగర్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా మరలా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. నగరంలోని 19వ డివిజన్ నల్లచెరువు 63వ సచివాలయ పరిధిలో గురువారం నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 99 శాతం పైగా అమలు చేశారని గుర్తుచేశారు. సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. సంక్షేమ పథకాల్ని కుల, మత పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాలకు అనుగుణంగా నగరంలో అన్ని వార్డులలో అభివృద్ధి పనుల్ని ప్రాధాన్యతా క్రమంలో నిర్వహిస్తున్నామని వివరించారు. ఇప్పటికే గుంటూరు నగరంలో రూ. 400 కోట్లకు పైగా అభివృద్ధి పనుల్ని చేస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు జన్మభూమి కమిటీల సిఫారసు ఉంటేనే వచ్చేవని, ఇప్పుడు అర్హత ఉంటే వెంటనే వచ్చేస్తాయని తెలిపారు. ఇన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్న జగన్ మోహన్‌రెడ్డిని మరలా ఏపీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మేయర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేసీఎ క్లస్టర్ ఇంచార్జులు గేదెల రమేష్, భాస్కర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి నూనె ఉమామహేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు టెంట్ హౌస్ బాబు, ఖాజా మొహిద్దీన్, బాలశౌరి, కవిత, సుల్తాన, షకీలా, అంజలి, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రముఖ విద్యావేత్త రంగారావుకు ఘన నివాళి

పాత గుంటూరు: గుంటూరులోని గొట్టిపాటి కల్యాణ మండపంలో గురువారం ప్రముఖ విద్యావేత్త డాక్టర్ ఉమ్మనేని రంగారావు సంస్మరణ సభ నిర్వహించారు. సంతాప సభలో పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, మాజీ ఎమ్మెల్యేలు వై.వి. ఆంజనేయులు, ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ ఎంపీ జేడీ శీలం, విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య, మలినేని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు, కమ్మ జన సేవాసమితి ఎస్. కోటేశ్వరరావుతో పాటు వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొని రంగారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రైతు కుటుంబానికి చెందిన రంగారావు అంచెలంచెలుగా ఎదిగి, ఎంతోమంది విద్యార్థుల్ని తీర్చిదిద్దారని వక్తలు కొనియాడారు. బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం, మహాప్రస్థానం నిర్మాణంలో తనవంతు పాత్ర పోషించారని కొనియాడారు. ప్రొఫెసర్ జంపని కిశోర్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు చిటిపోతు మస్తానయ్య, రంగారావు, కుటుంబ సభ్యులు వీరయ్య చౌదరి, నాగేశ్వరరావు, సుజాత, సిరి, సోదరుడు వి. నాగేశ్వరరావు పాల్గొని నివాళులు అర్పించారు.

# నిస్వార్థ విద్యారంగ సేవకుడు మాణిక్యరావు



మాణిక్యరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మోజెస్, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ, అధ్యాపక హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటాలు చేసిన ఎం.జె.మాణిక్యరావును నిత్యం స్మరించుకోవాలని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు తెలిపారు. ఉపాధ్యాయ, అధ్యాపక ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్సీ మాణిక్యరావు 15వ వర్ధంతి సందర్భంగా ఏసీ కళాశాల కూడలిలోని ఆయన విగ్రహానికి ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ దశాబ్దాల పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విద్యాభివృద్ధికి కృషి చేయడంతో పాటు ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసి లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన పోరాట యోధుడు మాణిక్యరావు అని కొనియాడారు. కార్యక్రమంలో యూజీసీ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ మంచాల బోసు బాబు, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్, జూనియర్ కళాశాలల అధ్యాపక సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ అయాజుద్దీన్, పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో 'నాన్ బ్యాంకింగ్' వ్యవస్థ కీలకం

**ఫిన్వెస్కో హోల్డింగ్స్ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర**



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జక్కంపూడి రవీంద్ర, యుగంధర్, రాకేష్ తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్న భారతదేశంలో నాన్ బ్యాంకింగ్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తున్నదని ఫిన్వెస్కో హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జక్కంపూడి రవీంద్ర పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలో 'ఫిన్వెస్కో క్యాపిటల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' నూతన కార్యాలయాన్ని గురువారం ప్రముఖ వ్యాపారవేత్తలు అరవపల్లి యుగంధర్, కూరపాటి సాంబశివరాజు తదితరులతో కలసి గురువారం ఆయన ప్రారంభించారు. రవీంద్ర మాట్లాడుతూ ఫిన్వెస్కో గ్రూపులోని హోల్డింగ్ కంపెనీ 'ఫిన్వెస్కో క్యాపిటల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా గుర్తింపు పొంది దేశవ్యాప్తంగా శాఖలు ఏర్పాటు చేస్తోందని చెప్పారు. కనీసం రూ.10 వేల నుంచి ఎంత మొత్తమైనా పెట్టుబడితో నాన్ కన్వర్టబుల్ డిబెంచర్‌లో పెట్టుబడి పెట్టే వారికి 16 నెలల నుంచి 66 నెలల వరకు 10.50 శాతం నుంచి 12.50 శాతం వరకు వడ్డీని పొందవచ్చని వెల్లడించారు. ఫిన్వెస్కో క్యాపిటల్ డైరెక్టర్ రాకేష్ అలమంద మాట్లాడుతూ హైదరాబాదు కేంద్ర కార్యాలయంగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో శాఖలను విస్తరిస్తున్నట్లు చెప్పారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో 25 శాఖలను త్వరలో ఏర్పాటు చేసి 30 వేల కుటుంబాలకు స్వల్ప, మధ్య కాలిక రుణాలతో పాటు లెండింగ్, పర్సనల్, వ్యాపార అభివృద్ధి రుణాలు అందించబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లోన్స్ డిపార్టుమెంట్ హెడ్ కావూరి రామారావు, ఉప్పలపాటి శ్రీనివాస్, ఎస్. విజయభాస్కర్, పి.సాంబశివరావు, సీహెచ్. యుగంధర్, ప్రభాకర్, సీఏ అమరా శ్రీనివాసమూర్తి, పలువురు ఖాతాదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంపీపీగా ఇంటూరి పద్మావతి ఏకగ్రీవ ఎన్నిక





ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న పద్మావతి

గుంటూరు రూరల్: రూరల్ మండల పరిషత్ అధ్యక్షురాలిగా ఇంటూరి పద్మావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఎంపీపీగా విధులు నిర్వహించిన పులగం దివ్య రాజీనామా చేయడంతో వైస్ ఎంపీపీగా ఉన్న పద్మావతి ఇన్‌చార్జిగా కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం గతంలో బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు గురువారం నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో ఎన్నికను అధికారి ఎల్. వజ్రశ్రీ, ఎంపీడీవో ఆదినారాయణ నిర్వహించారు. ఎంపీపీగా పద్మావతి నామినేషన్ పత్రాల్ని ఎన్నికల అధికారికి అందజేశారు. ఆమెను వెంగళాయపాలెం ఎంపీటీసీ సభ్యుడు కాకాని రమేష్ ప్రతిపాదించగా, వైస్ ఎంపీపీ దర్శి సుజాత దాన్ని బలపరిచారు. సమయం గడిచే వరకూ ఎటువంటి నామినేషన్లు దాఖలు కాకపోవడంతో పద్మావతిని ఏకగ్రీవంగా ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం ఎన్నిక పత్రాల్ని ఆమెకు అందజేసి, ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా ఎన్నికైన ఎంపీపీని జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, జొన్నలగడ్డ ఎంపీటీసీ సభ్యురాలు పులగం దివ్య, చల్లావారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు పులిమి నాగరాజు, వెంగళాయపాలెం ఎంపీటీసీ సభ్యురాలు ఉడతా భూలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు షేక్ కరీముల్లా, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ శోభరాణి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పద్మావతి మాట్లాడుతూ తనకు పదవిని అందించిన ఎమ్మెల్యే మేకతోటి సుచరితకు, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మండలాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆమెను జొన్నలగడ్డ, గోర్లవారిపాలెం, మల్లవరం, తోకావారిపాలెం, దాసుపాలెం, చిన్నపలకలూరు, లాలుపురం, తురకపాలెం, నల్లపాడు, చల్లావారిపాలెం, వెంగళాయపాలెం, ఓబులునాయుడుపాలెం తదితర గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పలు డివిజన్ల వైఎస్సార్ సీపీ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా సన్మానించారు. భారీగా బాణసంచాను పేల్చి అభిమానాన్ని చాటుకున్నారు.

**జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ అభినందనలు**

రూరల్ మండలం ఎంపీపీగా ఎన్నికై న ఇంటూరి పద్మావతి, అంజిరెడ్డి దంపతులకు జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము) శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

# గోరంట్లలో స్వాములకు సద్ది ప్రారంభం



స్వాములకు సద్ది వడ్డిస్తున్న వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీ ధర్మచరణ్

గుంటూరు రూరల్: గోరంట్లలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో గ్రామ మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ ఆధ్వర్యంలో అయ్యప్ప, భవాని, శివ తదితర దీక్షలు స్వీకరించిన స్వాములకు సద్ది కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ పాల్గొన్నారు. తొలుత అయ్యప్ప స్వామికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మహా నైవేద్యం సమర్పించి, దీక్ష స్వీకరించిన స్వాములకు సద్దిని వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాల ధరించిన స్వాములకు సద్దిని ఏర్పాటు చేయడం మహా భాగ్యమని తెలిపారు. యర్రంశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ స్వాములకు ఏటా సద్ది కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. గోరంట్ల గ్రామ పరిసర ప్రాంతాల్లో నివసించే స్వాములంతా పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఎక్స్ సోప్స్ అధినేత అరుణాలచలం మాణిక్యవేల్, కంచర్ల ఆంజనేయులు, యర్రంశెట్టి సూరి, పులి శివకోటయ్య, చిల్లర శ్రీనివాస్, గుడి సతీష్ కుమార్, తోట రంగారావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుల అరెస్టు

గుంటూరు ఈస్ట్: హత్య కేసులో ఇద్దరు నిందితుల్ని పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. గుజ్జన గుండ్ల సెంటర్‌లో ఈనెల 8న ఆదినారాయణ ఇంట్లో హత్యకు గురయ్యాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేసిన పోలీసులు గురువారం అదే ప్రాంతానికి చెందిన షేక్ అబ్దుల్ షరీఫ్, క్రోసూరుకు చెందిన షేక్ బాజీలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు ఈస్ట్)
90109 57733
Office mail : sakshigntadvt@gmail.com